క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి.

కొండపి(సింగరాయకొండ): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కొండపి తహసీల్దార్ మురళి సూచించారు. బుధవారం కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

పీసీపల్లి: రైతు పంటను ఈ క్రాప్ చేయించాలని తహసీల్దార్ ఉష అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయించాలని, ఇందుకు అగ్రికల్చర్ సిబ్బంది చొరవ చూపాలన్నారు. కౌలుకార్డులు త్వరితగతిన జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేషన్‌దుకాణం సీజ్



రేషన్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న అధికారులు

పామూరు: మండలంలోని తూర్పు కట్టకింద పల్లె రేషన్ దుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాలో రికార్డులకంటే బియ్యం తక్కువగా 5.77 క్వింటాళ్లు, పంచదార 39.5 కేజీలు తక్కువగా ఉండటంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ సమీఉల్లా తెలిపారు. ఎక్కడైనా రేషన్ దుకాణాల్లో గానీ, రేషన్ పంపిణీలోగాని అక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తేవాలన్నారు. తనిఖీల్లో ఏఎస్ఓ జె.రవి, బీఆర్ఓ రఫీ, డీలర్ పి.పద్మావతి ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి(సింగరాయకొండ): ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కొండపి సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులకు ఇబ్బంది కలగకుండా ఆటోలు నిలుపుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ధ్రువీకరణ పత్రాలు, యూనిఫామ్ ఉంటేనే ఆటోలు నడపాలని స్పష్టం చేశారు.

పశువును ఢీకొని బైక్ బోల్తా, వ్యక్తి మృతి



ఘటన స్థలంలో మృతుడు శివశంకర్‌రెడ్డి

పామూరు: పశువును బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని గోపాలపురం వద్ద 565వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వగ్గంపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి శివశంకర్ రెడ్డి పామూరులో పనిచూసుకుని బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. గోపాలపురం వద్ద బైక్‌కు గేదెలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడగా, శివశంకర్‌రెడ్డి (40)కి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఒక సంతానం ఉన్నారు. సంఘటన స్థలాన్ని సీఐ భీమానాయక్ సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మౌలిక సదుపాయాలు, భద్రత ప్రధానం

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి ఒడిగట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలి. వైద్యులతోపాటు సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి భరోసా ఇవ్వాలి. కాకర్లలో ప్రభుత్వ వైద్యశాలను 1960లో నిర్మించారు. మరుగుదొడ్లు, రెస్ట్‌రూం, మీటింగ్ హాలు లాంటి కనీస వసతులు లేవు. వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. వాచ్‌మెన్‌ను నియమించి భద్రత కల్పించాలని కోరుతున్నాం.

– డాక్టర్ సాయి రుచిత, కాకర్ల పీహెచ్‌సీ, మర్రిపూడి

కోల్‌కతా తరహా ఘటనలు పునరావృతం కాకూడదు

కోల్‌కతాలోని ఆర్.జీ.కార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, దారుణంగా చంపిన మృగాళ్లను కఠినంగా శిక్షించాలి. అలాంటి ఘటనలు ఇంకెక్కడా జరగకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రి, పగలు తేడా లేకుండా రోగులకు సేవలు అందించే వైద్యులకు రక్షణ లేకుంటే చిత్తశుద్ధితో పనిచేసే పరిస్థితి ఉండదు. మహిళా వైద్యులు వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ఉండాలంటే చట్టాలను కఠినతరం చేసి దాడులకు పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలి.

సుజాత, ఏఎన్ఎం, కొండపి–1 సచివాలయం



ఏం చెప్పినా చేస్తాం..

- ముఖ్యనేతకు ఇద్దరు అధికారుల మొర
- అయినా మార్పు తప్పదంటున్న అధికార పార్టీ నేతలు..?

మమ్మల్ని కదిలించొద్దు ప్లీజ్..



కనిగిరి రూరల్:

సహజంగా ప్రభుత్వం మారితే ఏదో క్షేత్ర స్థాయి అధికారులు తప్ప ఒక స్థాయి అధికారులంతా స్థాన భ్రంశం చెందుతారు. ఇది సర్వ సహజం. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల్లో అధికారుల బదిలీ కచ్చితంగా ఉంటుంది. ఎందుకంటే గత హయాంలో పనిచేసిన వారు అప్పటి నేతలకు అనుకూలంగా ఉంటారనే భావన.. కొత్తగా అధికారంలోకి వచ్చిన నేతలు వారికి అనుకూలంగా ఉండే వారిని లేదా ఇతర అంశాలు, కోణాల ప్రభావంతో కొత్త వారికి అవకాశం కల్పిస్తారు. అయితే కనిగిరి నియోజకవర్గంలోని రెండు ప్రధాన శాఖలకు చెందిన ఇద్దరు అధికారులు మాత్రం మీరు చెప్పినట్లే చేశాం.. ఇంకా మీరు ఏం చెప్పినా చేస్తాం.. మమ్మల్ని మాత్రం కదిలించ వద్దంటూ నియోజకవర్గ ముఖ్య నేత వద్ద మొర పెట్టుకుంటున్నట్లు తెలిసింది. స్వామి భక్తిని చాటుకునే క్రమంలో ఆ ఇద్దరు అధికారులు ఇప్పటికే కనిగిరిలో అనేక ధమనకాండలు సృష్టించారు. అధికార పార్టీ నేతలకు సహకారం అందించారు. ముఖ్యనేత చెప్పిన దానికి మరో మెట్టు దాటి వ్యవహరించారు.. ఎంతలా అంటే చట్ట పరిధిలోని కొన్ని అంశాలను సైతం లెక్క పెట్టకుండా దుందుకుడుగా వ్యవహరించారు.

బదిలీ తప్పదా.. ?

రెవెన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గం కేంద్రమైన కనిగిరిలో రెండు ప్రధాన కార్యాలయాలకు చెందిన ఇద్దరు అధికారులు తాము కనిగిరి వదిలి వెళ్లకుండా ఉండేందుకు అనేక పాట్లు పడుతున్నారు. వారిద్దరు ఎంత మొర పెట్టుకున్నా.. ముఖ్య నేత వారిని నమ్మే పరిస్థితి లేదని ప్రచారం సాగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన వెళ్లిన ఓ అధికారికి ముఖ్యనేత సిఫార్సు లేఖ ఇచ్చినట్లు తెలిసింది. ఆ అధికారి గతంలో మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో కనిగిరిలో పనిచేయడంతో పాటు ముఖ్య నేతతో మంచి సంబంధాలు కల్గి ఉన్న అధికారి. దీంతో కొంత సమయం పట్టినా కచ్చితంగా తప్పక ఆ అధికారి కనిగిరికి బదిలీపై రావడం ఖాయం. ఇక మరో శాఖకు చెందిన అధికారికి దాదాపు బదిలీ ఖాయమని తెలిసింది. తాను అధికార పార్టీలోని చిన బాబు కు దగ్గర మనిషినని చెప్తూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆశాఖ కార్యాలయంలో హల్‌చల్ చేశారు. తాను చెప్పినట్లు బిల్లులు, ఫైల్స్‌లో సంతకాలు పెట్టక పోతే మిమల్ని దూర ప్రాంతాలకు బదిలీ చేయిస్తానంటూ బహిరంగంగానే తన కిందస్థాయి అధికారులను సైతం బెదిరించాడు. తదనుగుణంగా ముఖ్యనేత చెప్పిన పనికి పదిరెట్లు ఎక్కువగా దమన కాండలో తన పాత్ర పోషించాడు. ఈ క్రమంలో టీడీపీ పార్టీ సీనియర్ నేతలను కూడా బెదిరించాడు. దీంతో వారు తలలు పట్టుకున్నారు. ఈ అధికారి అవినీతిపై అధికార పార్టీలోని కొందరు నేతలు నేరుగా సీఎంఓకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపులో భారీస్థాయిలో హస్త లాఘవం చూపించాడనే ఆరోపణలున్నాయి. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ముఖ్యనేత కార్యాలయం నుంచి ఇటీవల కనిగిరిలో పనిచేసి వెళ్లినా.. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో ఉద్యోగం చేస్తున్న అధికారి ముఖ్యనేత సిఫార్సు లేఖను ఇచ్చినట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. దీంతో ఖంగుతిన్న ప్రస్తుత అధికారి వెంటనే ముందస్తు చర్యగా గుంటూరు, కృష్ణా జిల్లాలకు బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. చిలకలూరిపేటకు బదిలీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. అయితే మరో పక్క తాను కనిగిరిలోనే ఉండేందుకు అతని సామాజిక వర్గాల నేతలో ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు అధికారుల బదిలీలు కచ్చితంగా జరుగుతాయని ఆయా శాఖల కార్యాలయాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా బదిలీల ప్రక్రియ ఈనెల 31న పూర్తి కానున్న నేపథ్యంలో ఏం జరుగుతుందనేది వేచి చూడాల్సి ఉంది.

తాగునీరు, మేత కల్పించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకలు, పశువుల యజమానులు

వెలిగండ్ల: వెలిగండ్లను కరువు మండలంగా ప్రకటించారే గానీ పశువులు, మేకలు, గొర్రెలకు నీటివసతి, మేత భూమి, ఇతర వసతులు కల్పించలేదని గొర్రెలు, మేకల పెంపకందారుల జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, స్థానిక పశువైద్యశాల ముందు బుధవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశువుల పోవడానికి దారులు, మేత భూమి కేటాయించాలన్నారు. పందువగండి రిజర్వాయర్ ఆక్రమణకు గురైందని, వాటిని తొలగించాలన్నారు. ప్రతి గ్రామంలో నీటి తొట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ రామచంద్రయ్య, పశువైద్యశాల సిబ్బందికి అందచేశారు. గొర్రెలు, మేకల పెంపకందారుల జిల్లా ఉపాధ్యక్షుడు కంటే బాలకృష్ణ, గొర్రెల మజమానులు కడెం లక్ష్మయ్య, పెరుగు తిరుపాలు, అరవ చిననాగయ్య, గోసు వెంకటయ్య, బోళ్ల మల్లిఖార్జున కుర్ర చెంచ్య, ఏసురత్నం పాల్గొన్నారు.

ఘనంగా ఆఖర్ చహ షుంబా వేడుకలు



ప్రత్యేక దువాలో చైర్మన్ అబ్దుల్ గఫార్, ముస్లిం పెద్దలు

కనిగిరి రూరల్: ఆఖరి చహ షుంబా (చివరి బుధవారం) గరిక తొక్కు పండుగను ముస్లింలు బుధవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ముస్లింలు స్థానిక దొరువు వద్ద ఉన్న కొండ ప్రాంతానికి చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ ఆధ్వర్యంలో మత పెద్దలు, ముస్లిం పెద్దలు ప్రత్యేక దువా చేశారు. చైర్మన్ గఫార్ స్వీట్లు, పాయసం పంపిణీ చేశారు. కొందరు వారి ఇళ్ల దగ్గర నుంచి తెచ్చుకున్న పిండి వంటకాలను ఒకరినొకరు ఇచ్చుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సర్వ మానావళీ ఆరోగ్యంగా.. సంతోషంగా ఉండాలని, పచ్చని పంట పొలాలతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలనే సందేశాన్నిచ్చారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం (సఫరుల్ ముజఫ్ఫర్ నెలలో) చివరి బుధవారం రోజున ఆఖరి చహ షుంబా వేడుకలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. న్యాయవాది సుమైర్(హన్ను), బన్ను, షఫీ ఆజాద్, సయ్యద్ నాయబా, ఎస్‌కే బారాయిమామ్, ఎస్‌కే రఫీ, వలి, మున్నా, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీసీలిస్తే వెళ్లిపోతాం...

- రోడ్డెక్కి ధర్నా చేసిన విద్యార్థులు
- మూడు నెలలవుతున్నా ప్రారంభం కానీ తరగతులు



గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

కందుకూరు రూరల్: ' మూడు నెలలైనా ఇంత వరకు తరగతులు ప్రారంభించలేదు. ఇలాగైతే మా పరిస్థితి ఏంటి. టీసీలు ఇస్తే వెళ్లిపోతాం ' అంటూ విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు.

వివరాల్లోకి వెళితే..పేద విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువులకు బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు గుడ్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కోర్సును ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి క్యాంపెయిన్ చేసి విద్యార్థులను చేర్పించారు. అదే పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులను కూడా కలిసి అడ్మిషన్లు చేయించారు. దీంతో ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో 9 మంది, సీఈసీ తెలుగు మీడియంలో 19 విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అయితే తరగతులు ప్రారంభమమై మూడు నెలలవుతున్నా ఇంత వరకు అధ్యాపకులను నియమించ లేదు. ఎంపీసీలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సీఈసీలో కామన్ సబ్జెక్టులతో పాటు సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించాల్సి ఉంది. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు పాఠశాలలో బోధించి ఉపాధ్యాయులతో అడపాదడపా నెట్టుకొస్తున్నారు. కానీ మెయిన్ సబ్జెక్టులకు ఇప్పటి వరకు పాఠ్యాంశాలు మొదలు కాలేదు. ఇప్పటికే యూనిట్ -1 పరీక్ష గత నెలలో పూర్తి కాగా, యూనిట్ -2 పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంత వరకు తరగతులు ప్రారంభించకపోవడంతో గురువారం విద్యార్థులు రోడ్డెక్కి ధర్నా చేశారు. మాకు టీసీ ఇస్తే వేరే కాలేజీల్లో చేరామని విద్యార్థులు కోరుతున్నారు.

సర్దుబాటు టీచర్లనే నియమిస్తారట...

కందుకూరు నియోజకవర్గంలోని అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దు చేసి ఆ ఉపాధ్యాయులను జూనియర్ కళాశాలకు పంపిస్తామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. కానీ మొదట్లో మాన్యువల్‌గా టీచర్ల సర్దుబాటును చేస్తామని చెబుతున్న అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఖాళీలను ఎంచుకునేలా చేశారు. ఇది కాస్తా ఆలస్యమై ఇప్పటి వరకు టీచర్ల సర్దుబాటు కాలేదు. ఇంత వరకు అధ్యాపకులు రాలేదు. ఇలా విద్యాశాఖ, ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో విద్యార్థుల చదువు కుంటుపడుతున్నాయి. కనీసం ఆయా పాఠశాలలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై అయినా పంపించి పాఠాలు చెప్పించాలి. ఆ తర్వాత నియమ నిబంధనల మేరకు సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా కారణంగా పేద విద్యార్థుల చదువులు పూర్తిగా వెనుకబడుతున్నాయి. ప్రభుత్వ, అధికారుల తీరుపై తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీసీలు అడుగుతున్నారు: రామ్మోహన్‌రావు, హెచ్ఎం

అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు మాకు టీసీ ఇవ్వండి వెళ్లిపోతామంటున్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఇప్పటి వరకు పాఠ్యాంశాలు మొదలు కాకపోతే ఇబ్బందిపడతారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. పని సర్దుబాటు కింద ఉన్న ఉపాధ్యాయులను జూనియర్ కళాశాలకు పంపిస్తామన్నారు.

వారంలో నియమిస్తాం: రాఘురామయ్య: ఇన్‌చార్జి డిప్యూటీ డీఈఓ, కందుకూరు

బుధవారం పని సర్దుబాటు చేశాం. వారం రోజుల్లో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను అక్కడికి పంపిస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

అభయాంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ



ఆలయానికి భూమిపూజ చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారి పల్లెలో అభయాంజనేయస్వామి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం రుత్వికుల వేదమంత్రాల నడుమ భూమిపూజ చేశారు. రుత్వికులు చిమట కార్తీక్‌శర్మ వేద మంత్రాలతో గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, గర్తరిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ ప్రాంగణంలో అర్చకులు వేద మంత్రాలతో మహాగణపతి హోమం, అష్టాదిశ నవగ్రహహోమం నిర్వహించారు. అనంతరం ఆలయ భూమిపూజ శిలకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి గర్తరిలో పంచలోహాలు, నవరత్నాలు, నవధాన్యాలు వేసి శిలను ప్రతిష్ఠించి భూమిపూజా క్రతువును నిర్వహింపచేసి తదుపరి పూర్ణాహుతి నిర్వహించారు. అంబాల శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, పరుచూరి సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

పొగాకు లోగ్రేడ్ ధర ఢమాల్

- ఒక్క రోజే కేజీకి రూ.10 తగ్గిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం లోగ్రేడ్ ధర కేజీకి రూ.10 మేర వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు లబోదిబోమన్నారు. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 953 బేళ్లను వేలానికి తీసుకురాగా 880 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి ధర రూ.302.80 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. జువ్విగుంట, అయ్యవారిపాలెం తంగెళ్ల, జాల్లపాలెం, పీరాపురం రైతులు 1201 బేళ్లు వేలానికి ఉంచగా అందులో 977 బేళ్లు కొనుగోలయ్యాయి. కనిష్ట ధర రూ.195, సరాసరి ధర రూ.282.08 పలికింది.

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నుంచి బ్యార్నీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అక్టోబర్ 24వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

వలేటివారిపాలెం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నేషనల్ హెల్త్ మిషన్ రూ.50 లక్షల నిదులతో అధునూతమైన వైద్య పరీక్షల కోసం ల్యాబ్ భవనానికి ఎమ్మెల్యే నాగేశ్వరావు బుధవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గానికి సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుబాబు, తహశీల్దార్ అబ్దుల్ హమీద్, డీటీ విజయభాస్కర్‌స్కార్, మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీ నరసింహం, సర్పంచ్ శ్రీలత, న్యాయవాది వలేటి శ్రీధర్‌నాయుడు, గ్రామ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



వైద్యశాలను తనిఖీచేస్తున్న వెటర్నరీ డీడీ యోగానందప్రసాద్

సీఎస్‌పురం(పామూరు): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ మార్కాపురం డీడీ డాక్టర్ యోగానందప్రసాద్ అన్నారు. సీఎస్‌పురంలోని పశువైద్యశాలను, మండలంలోని డీజీపేట, అంబవరం పశువైద్యశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పశుపోషకులకు ప్రభుత్వం అందించే పథకాల అమలుతీరు తెన్నుల గురించి తెలుసుకున్నారు. సీజనల్‌వ్యాధులు, టీకాలు, ముఖ్యంగా గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లా వ్యాక్సిన్ వినియోగంపై ఆరాతీశారు. మండలానికి గోకులం షెడ్స్ 25 మంజూరయ్యాయన్నారు. ఆయన వెంట కనిగిరి ఏడీ డాక్టర్ గజ్జెల శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఏడీ ఏడీ డాక్టర్ ఆర్.రమేష్, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌కుమార్

హనుమంతునిపాడు: ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మెడికల్ అధికారి దార్ల సందీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఆస్పత్రిలో ఎంఎల్‌హెచ్‌పీలకు, ఏఎన్ఎంలు, ఆశాలకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌లో విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. సెంటర్ల పరిధిలో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జ్వరాలు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. క్లీనిక్ పరిధిలో జ్వర పీడితులకు ప్రత్యేక పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.